కోళ్ల వ్యర్థాలతో చేపల సాగు

- ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం
- వ్యాపారులకు అండగా స్థానిక నాయకులు
- మండలంలో వందల ఎకరాల్లో చేపల సాగు



జింకలపల్లిలో కోళ్ల వ్యర్థాలను సరఫరా చేస్తున్న దృశ్యం



తిమ్మాపురం సమీపంలో సాగు చేస్తున్న చేపల చెరువులు



షేకుపల్లిలో కోళ్ల వ్యర్థాలతో పెంచుతున్న చేపలు

ఎర్రవల్లి: తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించాలన్నా దురుద్దేశంతో చేపల చెరువుల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు, కోడి పేగులు, ఈకలు, కుళ్లిన మాంసం చేపలకు ఆహారంగా వేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ప్రజలు ఆరోగ్యం పాడవుతున్నా, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నా మత్స్యశాఖ, స్థానిక అధికారులు మామూళ్ల మత్తులో చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వందల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం, షేకుపల్లి, సాసనూలు, కొండేరు, జింకలపల్లి, మొగిళిరావుల చెర్వు తదితర గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా వందల ఎకరాల్లో చేపల సాగు చేపట్టారు. చేపలకు మేతగా వేరుశనగచెత్త, తవుడు, సోయాబీన్ మిలెడ్‌లను వాడాల్సి ఉంటుంది. కానీ సంప్రదాయ మేతను వేయడం వల్ల నెలకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ ఖర్చును తగించుకునేందుకు గాను కొందరు చేపల చెరువుల యజమానులు కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి దీనికి స్థానిక నాయకులు అండగా ఉండటంతో పట్టపగలే ఆటోలు, వ్యాన్లలో కోళ్ల వ్యర్థాలను కర్నూలు, గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి విచ్చలవిడిగా తరలిస్తున్నారు. స్థానిక గ్రామాల ప్రజలు దీనిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు సంభందిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వ్యర్థాలే చేపలకు ఆహారం..

సాధారణ మేతను వేయడం వల్ల చేపలు నెలకు అర కేజీ నుంచి కేజీ వరకు మాత్రమే తూకం తూగుతుంది. కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన కోడిగుడ్లను వేయడం వల్ల చేపలు సాధారణ బరువు కంటే రెండు రెట్లు అధికంగా బరువు పెరుగుతాయి. దీంతో అధిక లాభాల పొందవచ్చన్న అత్యాశతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా చేపల సాగు చేస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో వందల ఎకరాల్లో అక్రమంగా చేపల చెరువులు సాగు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు జిల్లా మత్స్యశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

చట్టపరమైన చర్యలు



చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన కోడిగుడ్లు వేయడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వం నిషేధించిన వ్యర్థాలతో చేపలను సాగు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– నరేష్, తహసీల్దార్, ఎర్రవల్లి

కేసులు నమోదు చేస్తాం



చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తే వాహనాలు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తాం. పలుమార్లు చికెన్ వ్యర్థాలను తరలిస్తూ పట్టుబడిన వాహనాలను పీఎస్‌కు తరలించి మత్స్యశాఖ అధికారులకు సమాచారం అందించాం.

– రవిబాబు, సీఐ, అలంపూర్

క్లుప్తంగా

వెండి ప్లేట్లు బహూకరణ



అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాలకు దాతలు వెండి ప్లేట్లు బహూకరించినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన భద్రయ్య అనే భక్తుడు జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు శుక్రవారం రూ.34 వేలు విలువ చేసే వెండి ప్లేట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వెంకట్రాయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

రాజోళి: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని చంద్రప్రియ పదో తరగతిలో 531 మార్కులు సాధించిన సందర్భంగా ప్రోత్సాహకంగా చిరంజీవి అభిమాన సంఘ మండల అధ్యక్షుడు శివరామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రూ. 2,016 నగదు అందజేశారు. విద్యార్థిని శాలువాతో సత్కరిస్తూ.. భవిష్యత్‌లో విద్యార్థి చదువుకు తోడుగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నిషాక్, వీరేష్, శాంతయ్య తదిదరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శేషదాసుల ఆరాధనోత్సవాలు

మల్దకల్: మండల కేంద్రంలో ఈనెల 4వ తేదీ నుంచి 6 వరకు శేషదాసుల 140 ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శేషదాసుల వంశీయుడు ధీరేంద్రదాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరాధనోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముందస్తు టీకాలు వేయించాలి



శాంతినగర్: పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయించాలని పశు వైద్యురాలు స్వరూపరాణి రైతులకు సూచించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం గ్రామంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 208 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వరప్రసాద్, బుచ్చమ్మ, వెంకటమ్మ, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



మానవపాడు: 108 అంబులెన్స్‌లో నిండు గర్భిణీ ప్రసవించిన ఘటన మండలంలోని చందూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని చందూరు గ్రామానికి రేణుక(24)ను ప్రసవం కోసం 108 అంబులెన్స్‌లో మానవపాడులోని ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో పైలెట్ దేవేంద్ర, ఈఎంటీ రాధామోహన్, ఆశా వర్కర్ జయమ్మ అంబులెన్స్‌లో సుఖప్రసవం చేశారు. రేణుక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డను మానవపాడు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా రేణుక కుటుంబ సభ్యులు అంబులెన్స్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం



ఆత్మకూర్: షహీద్ భగత్‌సింగ్ త్యాగాలు మరువలేనివని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు యువత సిద్ధం కావాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు ప్రసాద్, హన్మంతు, రాజు అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లో భగత్‌సింగ్ జీపుజాతాను నిర్వహించారు. ఈ నెల 5న మక్తల్ పట్టణంలో భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, వెంకటయ్య, అంజన్న తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్ అంధకారం



కూలీలకు బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజోళి: బాల్య వివాహాలతో బాలల భవిష్యత్ అంధకారంలో పడుతుందని చైల్డ్ వెల్ఫేర్ అధికారి(ఓఆర్‌డబ్ల్యూ)లక్ష్మీదేవి అన్నారు.మండలంలోని పెద్ద తాండ్రపాడు గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు వారి పిల్లలకు ఉత్తమ విద్యనందించాలన్నారు. బాల్య వివాహాలు నిర్మూలించాలన్నారు. బాల్య వివాహాల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి ఒక్కరూ బాలల హక్కులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అనూష, ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్ బీచుపల్లి తదిదరులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీసీ నవీన్‌కుమార్

ధరూరు: కిశోర బాలికలు రక్తహీనత సమస్య రాకుండా బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐకేపీ సీసీ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్వలపాడు గ్రామంలో కిశోర బాలికలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు ప్రత్యేక పౌష్టికాహారం అందిస్తున్నట్లు, ప్రతి ఒక్కరూ దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం సభ్యులు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

టోకెన్ల జారీలో నిబంధనలు సడలించాలి



పాన్‌గల్ రైతువేదికలో ధాన్యం టోకెన్ల కోసం గుమికూడిన రైతులు

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే వ్యవసాయ శాఖ వారు అందజేసే టోకెన్ల జారీలో ఉన్న నిబంధనలు సడలించాలని మండల రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ టోకెన్లు జారీ చేస్తేనే కేంద్రాల్లో ధాన్యం కాంటా చేస్తున్నారని, ఈ టోకన్ల జారీలో ఎకరాకు 32 క్వింటాళ్ల చొప్పున (కుంటకు 02 బస్తాల చొప్పున) దిగుబడి వస్తుందనే అంచనాలతో అధికారులు టోకెన్లను జారీ చేస్తున్నారు. కానీ వాస్తావానికి ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. మరి మిగిలిన 3 క్వింటాళ్ల ధాన్యం ఏమి చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎకరాకు ఉన్న నిబంధనలను సడలించి టోకెన్లను అందజేసి ఇబ్బందులను తొలగించాలని మండల రైతులు కోరుతున్నారు. శుక్రవారం చాలా మంది రైతులు టోకెన్ల జారీ విషయంలో ఏఈఓలను ప్రశ్నించారు. ఈ విషయంపై ఏఓ రాజవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. ప్రభుత్వం ఎకరాకు 32 క్వింటాళ్ల దిగుబడి లెక్కన టోకెన్లను అందజేస్తున్నామని రైతుల అభిప్రాయాలను జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పుట్ట అంజనేయులు

వనపర్తి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మే 20న దేశంలోని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని, అన్ని రంగాల కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు బొబ్బిలి నిక్సన్, సునీత, ఆర్ఎన్ రమేష్, రాము, శారద, నారాయణమ్మ, నందిమళ్ల రాములు, శ్రీనివాసులు, జ్యోతి, కవిత, బాలకిష్టమ్మ, పార్వతమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు

మానవపాడు: మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్ర శివారు ప్రాంతంలోని జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించకూడదని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం



జాతీయ రహదారిపై నేలకొరిగిన చెట్లు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో మోస్తరు వర్షం కురిసింది. గాలులకు మండల కేంద్రం జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో చెట్లు నేలకొరిగాయి. కలాల్లోని పొగాకు, మిర్చి నిల్వ చేసిన రైతులు అవస్థలు పడ్డారు.

నేడు 'చలో బస్‌భవన్'

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికులపై రోజురోజుకు పెరుగుతున్న పనిభారంతో పాటు బకాయిల చెల్లింపు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలు తదితర సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం చలో బస్‌భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు ఐఎన్‌టీయూసీ అనుబంధమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రీజినల్ కార్యదర్శి విజయ్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు.. జిల్లాలోని ఆర్టీసీ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మానసిక వైద్యం గురించి వివరిస్తున్న జిల్లా సైకాలజిస్ట్ ప్రదీప్‌కుమార్

మానవపాడు: మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని మానసిక వైద్య నిపుణుడు ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక రోగులకు వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుతున్న సామాజిక, సాంస్కృతిక స్థితిగతులు మానవ జీవన విధానంపై, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రతి నెల మొదటి శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రం, ప్రతి రోజు జిల్లా ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటానన్నారు. పట్టణీకరణ వలసలు, నిరుద్యోగం, నేరాలు, ప్రకృతి విపత్తులపై ఒత్తిడి, ఆందోళన, భయం, అసహనం పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ తిరుమల్‌రావు, వైద్యసిబ్బంది రోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు



గోడపై హెచ్చరిక చూయిస్తున్న రెవెన్యూ అధికారులు

మానవపాడు: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ అన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోని సర్వే నం. 36లో 2.38 గుంటల్లో శ్రీరాఘవేంద్ర స్వామి ట్రస్ట్ పేరున కొనుగోలు చేసి రెవెన్యూ రికార్డుల్లో గతంలో నమోదు చేశారని.. ప్రభుత్వ భూముల బదలాయింపు, నిషేదిత చట్టం – 977 ప్రకారం కొనుగోళ్లు చెల్లదన్నారు. ఈ పక్షంలో తిరిగి భూమిని 2.38 గుంట భూమిని స్వాధీనం చేసుకున్నట్లు బోర్డు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా, ఆర్ఐ గురురాజ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోదీ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న కులగణన సర్వే నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కుల సంఘాల పెద్దలను శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. దేశాన్ని 50 సంవత్సరాలు పాటు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఎప్పుడూ కులగణన చేయలేదన్నారు. వెనుకబడిన వర్గాలకు కులగణన సర్వే ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదన్న, వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, రాజశేఖర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

అయిజ: మండల కేంద్రంలో గురుకుల పాఠశాలను వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల పక్షం కమిటీ నాయకులు శుక్రవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అయిజలో గురుకుల పాఠశాల నిర్వహించారని, బిల్డింగ్ వసతి లేకపోవడంతో ఎర్రవల్లి చౌరస్తాకు తరలించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలను తిరిగి అయిజలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సుధాకర్‌గౌడ్, వెంకట్రాములు, ముక్కెరన్న, ప్రకాష్, రాంబాబు, రమేశ్ ఆచారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరులో అగ్ని ప్రమాదంలో గడ్డివాములు దగ్ధమైన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, బీఆర్ఎస్వీ కుర్వపల్లయ్య అన్నారు. రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపల్లే దేవదాసు, సింగరాజు మద్దిలేటి, జీకే ఈదన్న, వెంకటేశ్వర్లు, మదు, రంగన్న, చెన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

ఇటిక్యాల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వావిలాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు దారుల ఇళ్లను నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బేస్‌మెంట్ పూర్తి చేసిన లబ్ధిదారులకు మొదటి విడత కింద రూ.లక్ష మంజూరు చేస్తుందన్నారు. విడతల వారీగా మిగిలిన రూ.4 లక్షలు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్‌నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపైనే నూర్పిళ్లు

- ధాన్యం కాంటా కాకపోవడంతో రైతుల అవస్థలు
- భయపెడుతున్న ఈదులుగాలులు, అకాల వర్షాలు



నాగల్‌కడ్మూర్ ప్రధాన రహదారిపై వరిధాన్యం ఆరబోసిన రైతులు

అమరచింత: పండించిన వరి ధాన్యం ఎండిన తర్వాత అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు దాపరించాయి. ధాన్యం ఎండపోవడానికి పంట పొలాల వద్ద స్థలాలు లేకపోవడంతో ప్రధాన బీటీ రహదారులపైనే ఆరబెడుతున్నారు. వాతవరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఎప్పుడు గాలి వీచినా, మేఘావృతమైనా ధాన్యం కాపడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు చెప్పలేని విధంగా ఉంటున్నాయి. వరికుప్పల వద్ద రాత్రివేళలో కాపలా కాస్తు, ఎప్పుడు తమ ధాన్యం కాంటా వేసే సమయం వస్తుందో అని ఎదురు చూస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా వరి కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. సమయానికి తగు విధంగా హమాలీలు లేకపోవడంతో ధాన్యం ఎత్తడానికి జాప్యం జరుగుతుందని వాపోతున్నారు. అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూర్ ప్రధాన రహదారిపై నిత్యం రైతులు తమ వరిని రహదారిపై ఆరబోస్తూ వాటిని తిరిగి కుప్పలుగా పెడుతుండడంతో అటు వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి హమాలీల కొరత తీర్చి కాంటాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్తపల్లి వాసికి డాక్టరేట్

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లికి చెందిన శ్రీధర్ నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో రసాయన శాస్త్రం విభాగంలో చేసిన పరిశోధనలకు గాను శుక్రవారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీధర్ ప్రొఫెసర్ ప్రశాంతి పర్యవేక్షణలో 'కిలాలసిస్ అండ్ బయోలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్ నానో పార్టికల్స్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారన్నారు. ఆయన వైస్ ఛాన్సలర్ ఖాజా అల్లాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ప్రొ. అల్వాల రవీందర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీధరకు అభినందనలు తెలిపారు.